సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



గ్రీవెన్స్‌సెల్‌తో సత్వరన్యాయం

సిరిసిల్లక్రైం: గ్రీవెన్స్‌సెల్‌తో ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో 17 ఫిర్యాదులు స్వీకరించారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 20 కోడెలను వివిధ గోశాలలకు సోమవారం అందజేశారు. శ్రీనివాస్, నర్సింహామూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/33.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాతలు

వేములవాడ: రాజన్న నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన కోమల అగస్త్య కుటుంబ సభ్యులు సోమవారం ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్‌కు అప్పగించారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం చంద్రగిరి, తెట్టకుంట, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, అనుపురం గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు డిక్లరేషన్, యువత డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5 లక్షలు, రూ.4వేల పింఛన్, రూ.500కు సిలిండర్ అందిస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, ఎంపీటీసీ బస రాజశేఖర్, సర్పంచ్ కదిరె రాజుకుమార్, రమేశ్, రగుడు పర్శరాములు, మల్లేశం, కత్తి కనకయ్య, నీలం గురువయ్య, అశోక్, సతీశ్, గణేశ్ ఉన్నారు.

కళాశాల ఆకస్మిక తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న మోహన్‌రావు

వేములవాడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈవో) మోహన్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై క్రమశిక్షణ, మంచి నడవడిక, విద్య, మెరుగైన ఫలితాలు ఎలా పొందాలో పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ గజల్ కవిగా దేవానందం



దేవానందంను సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు, కవి బూర దేవానందం ఉత్తమ గజల్ కవిగా గుర్తింపు పొందారు. విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసిద్ధ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా సత్కారం పొందారు. ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయలక్ష్మిపండిట్, బిక్కి కృష్ణ, సంపాదకుడు బైస దేవదాస్, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం పాల్గొన్నారు.

యాదాద్రికి తరలిన బొప్పాపూర్ గ్రామస్తులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బొప్పాపూర్ గ్రామస్తులు సోమవారం యాదాద్రి దర్శనానికి వెళ్లారు. సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ గౌడ్ ఆధ్వర్యంలో 20 బస్సులు, 10 తుఫాన్ వాహనాలు, 10 కార్లలో గ్రామస్తులు యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లారు. మార్గమధ్యలో సిద్దిపేటలో టిఫిన్లు, దర్శనం అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు లడ్డూ, ప్రసాదాలు సైతం అందించారు.

మహిళలే అధికం

- జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల నమోదు
- పెరిగిన ఓట్లు 8,664
- జిల్లా ఓటర్లు 4,46,399
- ఇంకా ఓటర్ల నమోదుకు అవకాశం



సిరిసిల్లలో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆర్డీవో ఆనంద్‌కుమార్(ఫైల్)

సిరిసిల్ల ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు
వీర్నపల్లి	5,525	5,492
ఎల్లారెడ్డిపేట	18,900	19,707
గంభీరావుపేట	17,044	17,755
సిరిసిల్ల మున్సిపల్	37,303	38,717
తంగళ్లపల్లి	17,595	18,269
ముస్తాబాద్	18,003	18,699
మొత్తం	1,14,370	1,18,639

వేములవాడ ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
వేములవాడ మున్సిపల్	26,271	27,129	11
వేములవాడ రూరల్	8,940	9,440	0
రుద్రంగి	3,566	4,076	02
చందుర్తి	12,663	13,588	01
కోనరావుపేట	16,229	16,671	02
మేడిపల్లి	11,027	12,139	0
భీమారం	7,807	8,592	0
కథలాపూర్	16,624	18,456	0
మొత్తం	1,03,127	1,10,091	16

సిరిసిల్ల: జిల్లాలో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యం తెలిపే శక్తి మహిళల చేతుల్లోనే ఉంది. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో పురుషుల కంటే 4,269 మంది మహిళలు, వేములవాడ పరిధిలో 6,964 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జిల్లా పరిధిలో మొత్తం 4,46,399 ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల పేర్ల తొలగింపు కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 2018 నాటి ఓటర్ల జాబితాతో పోల్చితే 8,664 ఓట్లు పెరిగాయి. జిల్లా జనాభా 5,52,037 కాగా.. ఓటర్ల జాబితాతో పోల్చితే.. 80 శాతంగా నిర్ధారణ అయింది. అంటే 18 ఏళ్లలోపు పిల్లలు 20 శాతం ఉన్నట్లు తేలింది.

నాలుగు నియోజకవర్గాలు

జిల్లాలో సిరిసిల్ల నియోజకవర్గం పూర్తిగా ఉండగా.. వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు జగిత్యాల జిల్లాలో ఉన్నాయి. మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట, చొప్పదండిలోని బోయినపల్లి మండలాలు మాత్రమే జిల్లా పరిధిలో ఉన్నాయి.

వీర్నపల్లిలో పురుషులు అధికం

జిల్లాలోని అన్ని మండలాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉంటే వీర్నపల్లి మండలంలో మాత్రం మహిళా ఓటర్ల కంటే పురుషులు 33 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లా పరిధిలోని ఇల్లంతకుంట మండల ఓటర్ల జాబితా మానకొండూరు నియోజవర్గంలో ఉంది. బోయినపల్లి మండల ఓటర్ల సంఖ్య చొప్పదండి నియోజకవర్గం పరిధిలో ఉంది.

కొనసాగుతున్న ఓటర్ల నమోదు

జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపులు కొనసాగుతున్నాయి. బూత్ లెవల్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్‌ల పర్యవేక్షణలో ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. 2023 అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని ప్రచారం చేస్తున్నారు. అక్టోబరు 4న తుది ఓటర్ల జాబితాను వెల్లడించనున్నారు. సెప్టెంబరు 19వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అభ్యంతరాలపై సెప్టెంబరు 28వ తేదీ వరకు విచారణ జరిపి తప్పులుంటే సరిచేస్తారు. సెప్టెంబరు 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి.. ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు



జిల్లాలో పారదర్శకంగా ఓటర్ల నమోదు కొనసాగుతుంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. చనిపోయిన ఓటర్లను తొలగింపు పారదర్శకంగా ఉంటుంది. తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తాం. ఇప్పటికే ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పిస్తున్నాం. మొబైల్ వాహనాలతో క్షేత్ర స్థాయిలో చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించాం.

– అనురాగ్ జయంతి, కలెక్టర్

సార్లు.. పట్టించుకోండి

- ప్రజావాణికి బారులు తీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి
- వివిధ సమస్యలపై 39 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: తమ సమస్యలను విన్నవించుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి బాధితులు బారులు తీరారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను కలెక్టర్ అనురాగ్ జయంతి స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ సమస్యలపై 39 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో పవన్‌కుమార్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ ఉన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి



మా మక్యానాయక్ తండాలోని స్కూల్‌లో టీచర్‌ను నియమించాలి. తండాలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. 20 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పాఠశాల బిల్డింగ్ ఉన్నప్పటికీ టీచర్ లేక దాదాపు 2 కిలోమీటర్ల దూరంలోని బడికి వెళ్తున్నారు.

– మక్యానాయక్ తండావాసులు, గంభీరావుపేట

కొడుకులు పట్టించుకుంటలేరు



నాకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. నా భర్త తొమ్మిదేళ్ల క్రితం చనిపోయాడు. ఆయన ఉన్నప్పుడే ఆస్తి పంపకాల్లో గొడవలు జరిగాయి. అప్పటి నుంచి వేరుగా ఉంటున్నాను. ప్రస్తుతం నా ఆరోగ్యం సహకరించడం లేదు. ఆస్తిపంచి ఇవ్వడం లేదని నన్ను కొడుకులు ఇంట్లో నుంచి గెంటివేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– రాపెల్లి బుచ్చమ్మ, చంద్రంపేట

గ్రామంలో కోతుల బెడద



మాది సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు. మా ఊరిలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని నెలలుగా కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. రెండు రోజులుగా ఆరుగురిపై దాడి చేయగా, తీవ్రగాయాలయ్యాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– పెద్దూరు గ్రామస్తులు

సదరం సర్టిఫికెట్ మంజూరు చేయండి



నేను నరాల బలహీనతతో బాధపడుతున్నాను. స్వతహాగా నిలబడలేను. ఏ పని చేసుకోలేని పరిస్థితి. సదరం సర్టిఫికెట్ కోసం ఎన్నోసార్లు వెళ్లిన పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలి.

– చీమల ఐలయ్య, ఓబులాపూర్, ఇల్లంతకుంట

కబ్జా చేసిండ్రు



నేను 1983లో జగ్గారావుపల్లిలో ఒకరి నుంచి మూడు గుంటల భూమి కొన్నాను. తర్వాత ఉపాధి కోసం సిరిసిల్లకు వచ్చాం. ప్రస్తుతం ఆ స్థలానికి లక్షల్లో ధర ఉండడంతో అదే గ్రామానికి చెందిన ఓ అధికారి పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇదేంటి అని ప్రశ్నిస్తే ఇబ్బందులు పెడుతుండు. అధికారులే న్యాయం చేయాలి.

– బాలసాని పద్మ, జగ్గారావుపల్లి

ధాన్యం దిగుబడి 3.76 లక్షల మెట్రిక్ టన్నులు

- వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష
- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో వానాకాలం ధాన్యం దిగుబడి 3.76 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్ శాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. వానాకాలం(ఖరీఫ్)లో 1.62 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయింది. దీని ఆధారంగా 2023–2024 సీజన్‌లో 3.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీసంచుల లభ్యత, అందుబాటులో ఉన్న గోదాములు, రైస్‌మిల్లులపై సమీక్షించారు. వానాకాలం పంట పండే నాటికి రైతుల నుంచి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, జిల్లా మార్కెటింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ రమా, డీఆర్‌డీఏ ఏపీవో పాపారావు పాల్గొన్నారు.

ఇస్కాతో సెస్ ఎంవోయూ !

- సందర్శించిన సెస్ ఛైర్మన్, ఎండీలు
- ఏఈలకు నైపుణ్య శిక్షణ



ఇస్కా డైరెక్టర్‌తో సెస్ ఛైర్మన్, ఎండీ

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలందిస్తున్న సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సంస్థ హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఇస్కా)తో ఎంవోయూ చేసుకోనుంది. గచ్చిబౌలిలోని ఇస్కా డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావుతో సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ రామకృష్ణ సోమవారం సమావేశమయ్యారు. సెస్‌లోని అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)కు ఇస్కాలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు, కొత్త ప్రాజెక్టు ఏర్పాటుకు, థర్డ్ పార్టీ విచారణలకు ఇస్కా ద్వారా సహకారం పొందేందుకు అంగీకారం కుదిరింది. విద్యుత్ పంపిణీలో వస్తున్న ఆధునిక విధానాలు, సాంకేతికాంశాలపై సెస్ టెక్నికల్ సిబ్బందికి శిక్షణనివ్వడంపై ఇస్కాతో ఒప్పందం చేసుకోనుంది. ఈమేరకు ప్రాథమిక అంచనాల కోసం ఇస్కాను సెస్ బృందం సందర్శించింది. టెక్నికల్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ తిలకించారు. సెస్ అకౌంట్స్ అధికారి భారీ ఉన్నారు.

12 ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్లు

- రెడ్కో మేనేజర్ పరమాచారి

సిరిసిల్ల: జిల్లాలో 12 ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) మేనేజర్ పరమాచారి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12 ప్రాంతాల్లో పీపీపీ(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో చార్జింగ్ స్టేషన్లను పదేళ్ల ఆదాయం షేరింగ్ విధానంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు సెప్టెంబరు 4లోగా రెడ్కో ఆఫీస్‌లో సంప్రదించాలని, ఆన్‌లైన్‌లోనే నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సాయం

- దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపిక
- గొర్రెల యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష సాయం అందించే పథకంలో రెండోవిడత లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో దళిత బంధు రెండోవిడత లబ్ధిదారులను ఎంపిక చేయాలని, గొర్రెల యూనిట్లను వేగంగా అందించాలని సూచించారు. గృహలక్ష్మి పథకంలో అర్హులైన పేదలకు, ఇల్లు లేని వారిని గుర్తించాలన్నారు. ఇంటి పట్టాల పంపిణీ, జీవో 59లో వచ్చిన దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. ఆసరా పెన్షన్లలో లబ్ధిదారులు మరణిస్తే.. వారి స్థానంలో భాగస్వామికి పెన్షన్ బదిలీ చేయాలని సూచించారు. మూడు రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవే అంశాలపై కలెక్టర్లతో మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, బీసీ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, మైనార్టీ కార్యాలయ ఓఎస్డీ సర్వర్‌మియా పాల్గొన్నారు.

శివ..శివ



వేములవాడ: శ్రావణ సోమవారం రాజన్నను 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. ఎండ తీవ్రంగా ఉండడంతో ఆలయ పరిసరాల్లో భక్తులు పరుగులు తీశారు. ఉక్కపోతతో క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేని ఆలయ పరిసరాల్లో దుర్వాసన వచ్చింది. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు.



మంచినీటి సరఫరా సవ్యంగా జరగాలి

- మిషన్ భగీరథ సీఈ అమరేంద్ర



మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ అమరేంద్ర

సిరిసిల్ల: జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా సవ్యంగా జరిగేలా చూడాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ సీహెచ్.అమరేంద్ర కోరారు. అగ్రహారం నీటిశుద్ధి ప్లాంటు వద్ద ఇటీవల మిషన్ భగీరథకు కేటాయించిన సహాయకులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నీటి సరఫరాలో లోపాలను గుర్తించి, సవరించే దిశగా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. శుద్ధిచేసిన నీరు ఇంటింటికీ చేర్చే లక్ష్యంతో మిషన్ భగీరథ యంత్రాంగం పనిచేయాలన్నారు. కొత్తగా నియమితులైన సహాయకుల విధులు, బాధ్యతలు, సర్వీసురూల్స్‌ను వివరించారు. మిషన్ భగీరథ ఎస్ఈ కె.రవీందర్, డీఈఈలు ఎస్.జానకి, విజయ్‌కుమార్, డీఈఈ సీహెచ్ ప్రేమ్‌చందర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



ఇల్లంతకుంట(మానకొండూర్): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి కోరారు. మండలంలోని ముస్కాన్‌పేటకు చెందిన ఐదుగురు విద్యార్థులు నిత్యం 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇల్లంతకుంట హైస్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని టీచర్ సింగిరెడ్డి వీరారెడ్డి ఐదు సైకిళ్లు కొనుగోలు చేయగా.. వాటిని ఎమ్మెల్సీ చేతులమీదుగా అందించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం మహేశ్‌చంద్ర, నాయకులు శంకర్, మోహన్‌రెడ్డి,సందీప్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సలీం ఉన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

- సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్



మాట్లాడుతున్న ఏఈ పృథ్వీధర్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో పనిచేస్తున్న విద్యుత్ లైన్‌మెన్లు, హెల్పర్లు వినియోగదారుల నుంచి డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ హెచ్చరించారు. స్థానిక సెస్ ఆఫీస్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో మీటర్ల మార్పు పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని.. ఇక నుంచి సిబ్బంది తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా, ఇతరత్ర సమస్యలు ఉంటే 94408 14081 నంబర్‌కు సమాచారం ఇస్తే పరిష్కరిస్తామన్నారు.

బషీర్‌బాగ్ మృతులకు నివాళి



సిరిసిల్లటౌన్: ఇరవై మూడేళ్ల క్రితం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం చేయించిన ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ రేట్లు పెంచడంతో రైతులు, నిరుపేదల నుంచి నిరసనలు వెల్లువెత్తాయన్నారు. ఈమేరకు బషీర్‌బాగ్ వద్ద నిరసన చేపట్టగా ప్రభుత్వం పోలీసులతో భాష్పవాయువు, నీటిఫిరంగులు, కాల్పులు జరపడంతో ముగ్గురు రైతులు అక్కడికక్కడే మృతిచెందారన్నారు. దీంతో ప్రజలు అప్పటి సర్కారుకు ఎన్నికల్లో ఓటమి పాలుచేశారన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, జువ్వాజి విమల, శ్రీరాం సదానందం, సురేష్, వీరేశం, పోచమల్లు తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్వదర్శి చైతన్య కోరారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల ముఖ్య సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. పీఆర్సీని అమలుచేసి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి గంగరాజు, జిల్లా అధ్యక్షుడు కన్నం గంగయ్య, జిల్లా బాధ్యులు శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

సంచార జీవితాల్లో వెలుగులు



పట్టాలతో సంచారజీవులు



సంచారజీవులు ఏర్పాటు చేసుకున్న నివాసాలు

- కేరాఫ్ అడ్రస్ లేని వారికి నివేశన స్థలాలు
- 48 కుటుంబాలకు పట్టాలు పంపిణీ
- ఒక్కో కుటుంబానికి 242 గజాలు
- మోహినికుంట కేజీఆర్ కాలనీలో వసతులు
- ఐదెకరాలలో ప్లాట్లు ఏర్పాటు చేసిన గోపాల్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): వారంతా ఆధార్‌కార్డు.. అడ్రస్ లేని వారు. చెట్టు..పుట్టను నమ్ముకొని ఏళ్లుగా సంచార జీవితం గడుపుతున్న అభాగ్యులు. కనీసం ఇది మా కులం అని చెప్పుకునే గుర్తింపు కూడా లేదు. అక్షరజ్ఞానం లేకుండా బతుకీడుస్తున్న సంచారజీవులు. వారిని చేరదీసి.. ఆధార్ కార్డులు ఇప్పించడంతోపాటు వారి జీవితాలకు స్థిరత్వం కల్పించారు మోహినికుంటకు చెందిన కల్వకుంట్ల గోపాల్‌రావు. ఇతరుల చేతుల్లో ఉన్న మోహినికుంట శివారులోని సర్వే నంబర్ 334లో ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారు. లేఅవుట్ వేసి 48 కుటుంబాలకు ప్లాట్లను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 242 గజాల చొప్పున నివేశన స్థలాల పట్టాలు అందించారు. ఐదెకరాలలో సీసీరోడ్లు.. ఓవర్‌హెడ్‌ట్యాంక్.. ఇంకుడు గుంతలు..కరెంట్ వసతి కల్పించారు. ఇప్పుడు ఆ కుటుంబాలు నిశ్చింతగా బతుకుతున్నాయి.

సంచార జీవులకు స్థిరత్వం

ముస్తాబాద్ చుట్టుపక్కల జీవిస్తున్న సుగళి, పిట్లోళ్లుగా పిలిచే వారికి ప్రభుత్వ రికార్డుల్లో ఎలాంటి గుర్తింపు లేదు. వారు బీసీల, ఎస్సీల, ఎస్టీలా చెప్పలేని దుస్థితి. వన్యప్రాణులను వేటాడుతూ.. అటవీ ఉత్పత్తులను విక్రయించి బతుకుతుంటారు. వీరికే ప్రత్యేకమైన లిపిలేని భాష సైతం ఉంది. ఒక్కో ఊరిలో కొన్ని రోజులు ఉంటూ.. ఊరు మారుస్తూ కాలం వెల్లదీసే వారు. వీరి జీవితాలను గమనించిన గోపాల్‌రావు తమ స్వగ్రామం మోహినికుంటలో ఐదు ఎకరాలలో కాలనీని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం ఆ కాలనీకి చేరిన సంచార జీవుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. రక్షిత మంచినీటి ట్యాంక్‌ను నిర్మించారు. ఇంటికో ఇంకుడుగుంత కట్టించారు. మరుగుదొడ్లు, సీసీరోడ్లు నిర్మించారు. కరెంట్ స్తంభాలు వేయించి వెలుగులు అందించారు. ఇప్పుడా కాలనీలో అరవై మందికి పైగా పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారు.



కాలనీలోని సీసీరోడ్డు

పట్టాలతో ఆనందం

నివేశన స్థలాల పట్టాలతో వారి జీవితాల్లో సంతోషాలు నిండాయి. వారందరికీ ఎస్టీలుగా గుర్తింపు పత్రాలు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఇప్పించారు. అన్నింటికి మించి సహజీవనం, ఎలాంటి ఘర్షణలకు పోకుండా శాంతిగా జీవించేలా మార్పు తీసుకొచ్చారు. ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న వారికి మంత్రి కేటీఆర్ సహకారంతో నాలుగు రోజుల క్రితమే రెండు గుంటల చొప్పున మహిళల పేరిటా పట్టాలు అందించారు. మామిడి, సీతాఫలాలు సేకరించే వారికి హైదరాబాద్, సిద్దిపేటల్లో మార్కెటింగ్ అవకాశం కల్పించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు నౌకత్ విజయ్. కేజీఆర్ కాలనీలో నివసించే ఇతను ఆటో నడుపుతూ భార్య, ముగ్గురు పిల్ల లను పోషిస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితం సిద్దిపేట శివారులో విజయ్ ఆటోను లారీ ఢీకొట్టడంతో కుడి చేయి కోల్పోయాడు. ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య వున్న విజయ్‌కి మెరుగైన వైద్యం అందించేలా చూసిన గోపాల్‌రావు.. బ్యాంక్ రుణాన్ని ఇప్పించి కిరాణ దుకాణం నడిపేలా ప్రోత్సహించారు. కిరాణ దుకాణంతో ఉపాధి పొందుతున్న విజయ్ ఆత్మవిశ్వాసంతో బతుకుతున్నాడు.

ఏ ఆధారం లేని మమ్మల్ని ఆదుకున్నారు



మేము నాలుగేళ్ల క్రితం సంచార జీవులుగా బతికాం. మాకు ఏ ఊరు అని లేదు. గోపాల్‌రావు మాకు స్థలాలు ఇచ్చి, కాలనీ కట్టించాడు. మాకు నీడనిచ్చి.. బతుకుదెరువు చూపాడు. ఇప్పుడు మాకు రేషన్ వస్తుంది. ఆధార్‌కార్డులు ఉన్నాయి. పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– సాకేత్ రాజు, మోహినికుంట

బతుకునిచ్చిన మహానుభావుడు



చదువు ఎలా ఉంటుందో మా పిల్లలకు తెలియదు. డేరాలు వేసుకుని బతికే మాకు బతుకునిచ్చిండు. పట్టాలిచ్చి ఇండ్లు కట్టుకునే సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణం జరుగుతోంది. కొంత మంది రేకుల షెడ్లు వేసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతున్నారు.

– కాలియా రోజా, మోహినికుంట

ఏ ఆధారం లేని వారనే చేరదీశాం



నాలుగేళ్ల క్రితం వారికి ఎలాంటి ఆధారం లేదు. కనీసం అడ్రస్ అంటూ లేదు. కులం సర్టిఫికెట్లు ఇచ్చేవారు కాదు. ప్రభుత్వ రికార్డుల్లో లేని వారిని చేరదీసి మంత్రి కేటీఆర్ సహకారంతో కాలనీని నిర్మించాం. వారికి పట్టాలు ఇప్పించాం. త్వరలో ఇక్కడ ఇండ్లు నిర్మించి, అంగన్‌వాడీ, స్కూల్ కట్టిస్తాం.

– కల్వకుంట్ల గోపాల్‌రావు

అనారోగ్యంతో జనశక్తి మాజీ నాయకుడి మృతి



ఎర్రజెండాలతో అంతిమయాత్ర



గంగారాం (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేటకు చెందిన సీపీఐ(ఎం.ఎల్) జనశక్తి మాజీ నాయకుడు ముదాం గంగారాం (62) సోమవారం మృతిచెందాడు. కోనరావుపేటకు చెందిన గంగారాం సుమారు 40 ఏళ్ల క్రితం జరిగిన సిరిసిల్ల రైతాంగ పోరాటంలో చురుకుగా పాల్గొన్నాడు. అగ్రనాయకుడు కె.రాజన్న వేములవాడలో నిర్వహించిన సమావేశానికి వెళ్లివచ్చి నిమ్మపల్లిలో భూస్వాముల భూములు దున్నిన సంఘటనలో పాల్గొన్నాడు. ముదాం రాములు, భూపతిరెడ్డితో కలిసి జనశక్తిలో మానేరు దళ కమాండర్‌గా పనిచేశారు. గంగారాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీలు గంగారాం మృతదేహంపై ఎర్రజెండాలు కప్పి అంతిమయాత్ర తీశారు. బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, ముదాం ప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి తదితరులు పరామర్శించారు. మృతునికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు గణేష్, సతీష్ ఉన్నారు.

రాజన్నపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం మాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటలో సోమవారం తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన కాయితి మహేందర్‌రెడ్డి కుటుంబం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇదే అదునుగా తాళం పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఇటీవల పత్తిని విక్రయించగా వచ్చిన డబ్బులను బీరువాలో దాచినట్లు బాధితుడు తెలిపాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో ఇంటి పరిసరాలను డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

సంఘటితంతోనే అభ్యున్నతి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

ముస్తాబాద్(సిరిసిల్ల): సంఘటితంతోనే రెడ్డి కులస్తుల అభ్యున్నతి సాధ్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో నూతనంగా ఎన్నికైన రాజ్‌బహదూర్ వెంకటరామరెడ్డి సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం ఏఎంఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో అభివృద్ధి, చైతన్యం గల రెడ్డి సామాజికవర్గం వారు.. పేద రెడ్డీలను ఆదుకోవాలని కోరారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలన్నారు. రాజకీయాలకతీతంగా సమాజాభివృద్ధికి పనిచేయాలని కోరారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కుంబాల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి ఆగంరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి, రిటైర్డు జేసీ గూడ సురేందర్‌రెడ్డి, ఎద్దండి నర్సింహారెడ్డి, యెల్ల బాల్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, దేవిరెడ్డి, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజ్‌కిరణ్‌రెడ్డి, పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదవాలని ఉంది కానీ..

- చదివించే స్థోమత లేదు
- దాతల కోసం ఇంజినీరింగ్ విద్యార్థి వినతి



తల్లి జలతో విద్యార్థి రంజిత్

కథలాపూర్(వేములవాడ): తండ్రి చిన్నతనంలో వదిలేశాడు. తల్లి కూలీ పనులు చేస్తూ ఒక్కగానొక్క కొడుకును ఉన్నత చదువులు చదివించింది. ఇంటర్ పూర్తయ్యాక ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన కుమారుడు.. హాస్టల్ వసతి, స్పెషల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండటంతో ఆర్థికంగా ఆదుకోవాని వేడుకుంటున్నాడు. తాండ్ర్యాలకు చెందిన సాదుల జలకు కుమారుడు రంజిత్ ఉన్నాడు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి, కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. 42 వేల ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్ ఐఏఆర్ఈ కళాశాలలో ఐటీ విభాగంలో సీటు వచ్చింది. వసతి, కాలేజీలో స్పెషల్ ఫీజు చెల్లించాల్సి ఉండగా.. చేతిలో చిల్లి గవ్వలేదని విద్యార్థి రంజిత్, తల్లి జల ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రేకుల షెడ్డులో ఉంటూ బతుకుతున్నామని, ఫీజు చెల్లించేది ఎలా అని దీనంగా పేర్కొంటున్నారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తే ఇంజినీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కావాలని ఆశగా ఉందని రంజిత్ వేడుకుంటున్నాడు.

ఎవరైనా దాతలు ఉంటే..
ఫోన్ పే నంబర్ : 70951 63443కు సాయం చేయాలని అభాగ్యులు అభ్యర్థిస్తున్నారు.

ఓసీపీలో డోజర్ ఢీకొని కాంట్రాక్టు కార్మికుని మృతి



గంగాప్రసాద్(ఫైల్)

గోదావరిఖని: రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రయివేట్ ఓబీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గంగాప్రసాద్ (24) ప్రైవేట్ డ్రిల్ ఆపరేటర్ మృతి చెందాడు. గంగాప్రసాద్ ఓసీపీ–3 పైలట్‌క్వారీ వద్ద సోమవారం వేకువజామున డ్రిల్ పనులు చేస్తున్నాడు. డ్రిల్లింగ్ నడిచేందుకు ఆ ప్రాంతాన్ని క్లీన్ చేసేందుకు డోజర్ వద్దకు బయల్దేరాడు. అతడిని గమనించక డోజర్ ఆపరేటర్ యంత్రాన్ని ముందుకు నడపడంతో అతనిపై నుంచి వెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గంగాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా శవాన్ని కరీంనగర్ ఆసుపత్రికి.. అక్కడ నుంచి పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. యాజమాన్యం, కార్మిక సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే శవాన్ని మాయం చేశారని కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఓసీపీని మరో కేజీఎఫ్‌గా మార్చేందుకు ఓబీ కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారని, ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరాయి.

కొండపై భక్తుల రద్దీ




మల్లాపూర్(కోరుట్ల): శ్రావణంలో రెండో సోమవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని శ్రీకనక సోమేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు వచ్చారు.

తేట తెలుగు.. తేనెలొలుకు

- భావోద్వేగాలను మాతృభాషలోనే హాయిగా వెల్లడించగలం
- అమ్మభాషకు పట్టం కడదాం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

మాతృభాష తృణీకారం..
మాతృదేవి తిరస్కారంతో సమానం
– సినీ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
– సకిలించు ఆంధ్రుడా..
చావవెందుకురా..! – ప్రజాకవి కాళోజీ



గిడుగు-పిడుగు పుస్తక ముఖచిత్రం

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్(కరీంనగర్): మనిషి జీవన విధానంలో ఆయువుపట్టు వంటిది మాతృభాష. అందులో జ్ఞానాన్ని పొందలేనివారిలో అభివృద్ధి తక్కువగా ఉంటుందని, వ్యక్తిత్వ వికాసం, మేధాపరమైన ప్రగతి మందగిస్తాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. దేశభాషలందు తెలుగు లెస్స అని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని ప్రశంసలందుకున్న తెలుగుకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ భాషలోని నుడికారాలు, సామెతలు, జాతీయాలు, లోకోక్తులు వేటికవే ప్రత్యేకం. అమ్మ భాషలోనే మన భావోద్వేగాలను హాయిగా వెల్లడించగలుగుతాం. తెలుగు భాష ఉన్నతి కోసం విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి(ఆగస్టు 29న) సందర్భంగా ఏటా ఈరోజున తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.


ప్రాధాన్యత కోల్పోతున్న తెలుగు

గిడుగు వెంకట రామ్మూర్తి కృషితో తెలుగుకు కొత్త వెలుగులు వచ్చినప్పటికీ పాలకుల నిర్వాకంతో అమ్మ భాష రోజురోజుకూ నిరాదరణకు గురవుతోంది. తెలుగులో రాయడం ఆత్మన్యూనతగా, ఆంగ్ల మాధ్యమంలో చదవడం నాగరికంగా మారిన కారణంగా సొంత గడ్డపైనే తెలుగు పరాయిదయిపోయింది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలన్నది ఆచరణలో అంతంతమాత్రంగానే ఉంది. తెలుగు ప్రజల విజ్ఞప్తి మేరకు 2011లో కేంద్ర ప్రభుత్వం తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించింది. తెలుగువారి ప్రస్తావన మహాభారతం, బౌద్ధుల కాలంలోనూ ఉంది.

తెలుగు మహాసభలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపై తీసుకువచ్చి, తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, కళలను తెలుసుకొని, స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకోవాలన్న లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టింది. 1975 నుంచి 2012 వరకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 మే 2న తెలంగాణ సాహితీ అకాడమీ ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో అదే ఏడాది అక్టోబర్‌లో తెలుగు మహాసభలు నిర్వహించారు. అప్పటి నుంచి మళ్లీ వాటి ఊసే లేకుండా పోయింది.

కవులు చైతన్యం తీసుకురావాలి



ఆంగ్ల భాష వ్యామోహంలో పడి, తెలుగు భాషను విస్మరిస్తున్నాం, ఉద్యోగ నియామకాల్లో తెలుగు మీడియంలో చదివినవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. కోర్టు తీర్పులు తెలుగులో వెలువడేలా చూడాలి. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి.

– దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకుడు

తెలుగులో సాంకేతిక విద్యనందించాలి



ఆలోచనలను వ్యక్తపరిచే సాధనం అమ్మ భాష. నేడు తెలుగులో మాట్లాడటమే చిన్నతనంగా భావించడం బాధాకరం. సాంకేతిక విద్యను సైతం తెలుగు మీడియంలో అందించాలి. తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వెయిటేజీ ఇవ్వాలి.

– గాజుల రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

చిరస్మరణీయుడు.. గిడుగు



గిడుగు చిరస్మరణీయుడు. ఆయన వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. విశ్వవిద్యాలయాల్లో వాడుక భాష రాజ్యమేలుతోంది. పత్రికలూ పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది.

– నంది శ్రీనివాస్, సాహితీ గౌతమి అధ్యక్షుడు

మాతృభాష నేర్పించాలి



తెలుగు భాషను పరిరక్షించాలి. ప్రాథమిక చదువులు మాతృభాషలో కొనసాగితేనే ఆలోచన శక్తి, ప్రశ్నించేతత్వం విద్యార్థుల్లో పెరుగుతాయి. తల్లిదండ్రులు ఆంగ్లంపై ఉన్న వ్యామోహాన్ని తగ్గించి, పిల్లలకు మాతృభాష నేర్పించాలి.

– కేఎస్.అనంతాచార్య, సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

కొత్త తరానికి అందించాలి



భాషా నుడికారాలు, సాహిత్య సౌరభాలను కొత్త తరానికి అందించాలి. ప్రపంచీకరణతో మన భాషా సంస్కృతులను రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంగ్ల భాష వ్యామోహం నుంచి మాతృభాష వైపు మళ్లాల్సిన అవసరం ఉంది.

– కొత్త అనిల్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పరిపాలనలో అమలు చేయాలి



తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలి. వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పాలకులు పరిపాలనలో తెలుగును పక్కాగా అమలు చేయాలి. అందరం అమ్మ భాషకు పట్టం కడదాం.

– మాడిశెట్టి గోపాల్, సమైక్య సాహితీ అధ్యక్షుడు, కరీంనగర్

చెట్టును ఢీకొని ఒకరి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన గంభీరావుపేట మండలం నర్మాల శివారులో జరిగింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన బడిగే రాజశేఖర్(30) కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో మేస్త్రీ పనిచేస్తుంటాడు. పని ముగించుకొని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా మండలంలోని నర్మాల శివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనకాల ఉన్న మహేశ్‌కు గాయాలయ్యాయి. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.